కథ

**ఆమె- చెప్పాలనుకున్నదంతా చెప్పి, చివర్న "మీ యిష్టం" అంది.**

**సాధారణంగా అటువంటి మాటలు భార్యాభర్తల మధ్యనే వస్తాయి. వాళ్ళ మధ్య వుండే అనుబంధం తెగిపోయే ముందు, నిలబెట్టడానికి జరిగే ఆఖరి ప్రయత్నంలా వస్తాయి.**

# అత్తనిష్టం

అటువంటి ప్రయత్నం ఆమెవైపునించీ జరిగింది. ఇంక మిగిలివున్నదీ జరగాల్సినదీ అతని యిష్టం మీదే ఆధారపడి వుంది.

అతను ఆలోచనలో పడ్డాడు. అతని ఆలోచనలు తుదీ మొదలూ లేకుండా సాగాయి. గజిబిజిగా అల్లుకుపోయాయి. పెళ్ళైనప్పట్నుంచీ యిప్పటివరకూ తామిద్దరిమధ్యా జరిగినవన్నీ గుర్తు తెచ్చుకున్నాడు. ఆలోచిస్తున్నకొద్దీ విషయం చాలా చిన్నదనిపిస్తోంది. అంత చిన్న విషయానికి ఆమె అంత పెద్ద నిర్ణయాన్నెలా తీసుకోగలిగిందో అర్థమవలేదు. అదే సమయానికి ఆమె కూడా గతాన్ని తవ్వుకుంది. ముల్లు ఎంత చిన్నదైనా, దాన్ని మన శరీరంలో భాగంగా వుంచుకోగలమా అనేది ఆమె ప్రశ్న.

★ ★ ★

''ఈ వేళెందుకో వంట్లో బాగా లేదు''

''నీకసలెప్పుడు బావుంది? ఎప్పుడూ ఏడుపు మొహమే!''

''రాజులూ, దేవుళ్ళూ కిరీటాలెందుకు పెట్టుకునే వాళ్ళో తెలుసా? ...బాల్‌హెడ్ దాచుకుందుకు''

''ఆఫీసులో మీటింగుంది. సాయంత్రం లేటౌతుందేమో!''

''అంతేగానీ, యింటికి తొందరగా రావాలనే ఆలోచన ఎప్పుడూ రాదు''

''చీమా, దోమా ఫ్రెండ్సు. రెండూ కలిసి క్రికెట్‌మేచి చూడ్డానికి వెళ్ళాయి. లాస్ట్ వికెట్ పడిపోగానే అంపైర్ 'ఆలౌట్' అన్నాడు. ఆ మాట వినగానే దోమ కంగారు కంగారుగా పారిపోయింది''

''వంకాయకూర బాగా కుదిరింది కదూ?''

''ఎలాగో..పెళ్ళైన యిన్నేళ్ళకి.''

''మనిషి మొదట నిప్పుని కనిపెట్టాడు. ఆ తర్వాత వేటంటే యిష్టంలేని సోమరిపోతుని వెతుక్కుని తెచ్చుకున్నాడు. తను వేటాడి తెచ్చినవి వండిపెట్టడానికి..చుట్టూ పెరిగిపోతున్న ఎముకల గుట్టల్ని చూసి కొంత కాలానికి ఆ సోమరిపోతుకి తిండంటేనే విరక్తిపుట్టి తప్పించుకుపారిపోయాడు. ఆ తర్వాత మగవాడు పెళ్ళి అనే ప్రత్యామ్నాయాన్ని వెతుక్కున్నాడు''

''సాయంత్రం మా అమ్మా, చెల్లీ వస్తామని ఫోన్ చేసారు''

''...''

''వాళ్ళొస్తారనగానే ఎందుకలా మొహం మాడ్చుకుంటావు?''

''కృష్ణుడికి భార్యలెందరు? ఎనిమిది మంది. అంటే ఆయన కోడలికి అంతమంది అత్తగార్లన్న మాట.''

చిన్నగా నిట్టూర్చింది సృజన. కాంట్రాస్ట్. వర్తమానానికీ, గతానికీ కాంట్రాస్ట్. ఏమైపోయాయి ఆనాటి తన నవ్వులు? స్త్రీవాద భావాలు? కాలగర్భంలో కలిసిపోయాయా? పువ్వులై విరిసి ఈ యింటి ముంగిట్లో రాలిపడాల్సినవి ముడుచుకుపోయి ఎండి ఏ గాలికో కొట్టుకుపోయాయి.

భర్త...సునీల్‌తో ఏం మాట్లాడాలన్నా భయమే. ముళ్ళకంపతో గీరినట్టుంటుంది అతని ప్రవర్తన. పైగా చెప్పుకుంటాడు అదో పెద్ద క్రెడిట్‌లా.

''నాదంతా నిర్మొహమాటం పద్ధతి. మనసులో ఒకటుంచుకుని పైకి మరొకలా మాట్లాడటం రాదు. ఉన్నదున్నట్టు అనేస్తాను'' అంటాడు.

ఎందుకలా అనెయ్యటం? ఆ అనేది ఎదుటివాళ్ళని బాధపెట్టేదైనప్పుడు? అతననే కాదు, అతని తల్లీ, తండ్రీ, చెల్లీ అంతా అంతే.

''నీ జీతం చూసి మావాడికి చేసుకున్నాంగానీ నువ్వేదో పెద్ద అందగత్తెవనికాదు. వాడి పక్కన నిలబడే అర్హతే నీకు లేదు. కాస్త చూసి ఖర్చుపెట్టి, డబ్బేనా మిగల్నివ్వు తల్లీ. మీ పెళ్ళై యిప్పటికి మూడేళ్ళు . మరొకరు మరొకరైతే ఈపాటికి రెండంతస్తుల బిల్డింగ్ కట్టేవారు. మరి మీరో? ఇప్పటికింకా యింటి స్థలమే కొనుక్కోలేదు'' అంటుంది అత్తగారు.

తను అందగత్తె కాదు. ఏవరేజిగా వుంటుంది. నలుపులోకే లెక్క. తన జీతం కట్నం కోసమే చేసుకున్నారు. అదేమైనా గొప్ప విషయమా, పదే పదే చెప్పుకుందుకు? క్వార్టర్స్ యిచ్చారుగాబట్టి స్వంతింటి ధ్యాస పడలేదు. అదేనా తను బజారు కెళ్ళి కొనుక్కొచ్చి పడేసే వస్తువుకాదు, అతను యింట్రెస్టు తీసుకోవాలి. అతనికా ఆసక్తిలేదు. డబ్బు పీఎఫ్‌లోనూ, ఫిక్స్‌డ్ డిపాజిట్లలోనూ దాస్తున్నారు. మ్యూచువల్ ఫండ్స్‌లో పెడుతున్నాడు. తెలివిగానే ఇన్వెస్ట్ చేస్తున్నాడు. ఎప్పుడో కలిసొచ్చినప్పుడు కట్టిన యింటినే కొనాలని అతని ఆలోచన. అది వాళ్ళకీ తెలుసు. ఐనా, తనే చిన్న ఖర్చు చేసినా ఆక్షేపణ.

ప్రతి నిముషం ముళ్ళమీదున్నట్టే వుంటుంది వాళ్ళమధ్య. వాళ్ళలాగే తనూ నిర్మొహమాటంగా వుండటం నేర్చుకుని మనసులో వున్నవన్నీ అనేస్తే? అలా అనలేకపోటం తన బలహీనత కాదు. సంస్కారం. పెళ్ళి చేసుకునేది అప్పటిదాకా వున్న సంతోషాన్ని పెంచుకుని మరింత ఆహ్లాదంగా జీవితంలోని మధురిమని వంటరిగా కాకుండా జంటగా పంచుకుని అనుభవించడానికిగానీ మాటల్తో నొప్పించుకుని..కత్తి అంచుమీద నడుస్తున్నట్టు ప్రతి క్షణం అప్రమత్తంగా వుండటానికి కాదు. ఎందుకీ జీవితాలిలా సాగుతున్నాయి? ఎలా చెప్పాలతనికి, మల్లెపూలు విచ్చుకున్నంత సౌహార్ద్రంగా, పారిజాతాలు రాలిపడ్డంత అందంగా, సెలయేరు పారినంత గలగలా కాకపోయినా కనీసం బస్సుల్లోనో, రైల్లోనో తారసపడే తోటి ప్రయాణీకుడి పట్ల చూపించినంత కర్టసీ కట్టుకున్న భార్యపట్ల కూడా చూపించాలని?

★ ★ ★

''వావ్! సృజనా! ఈ సిమెంట్ కలర్ శారీ నీకు బలే సూటైందే.. ఇంతందంగా చీర కట్టుకోవటం ఎక్కడ నేర్చుకున్నావే? స్టార్చ్ చేసిన కాటన్ చీర, బిగుతుగా వేసుకునే పొడవైన జడ...ఈ రెండూ చూసే మీ సునీల్ ఫ్లాటైపోయాడా?''

...

''ఆ క్రీమేదో తీసుకొచ్చాను. మొహానికి రోజూ రాసుకోకూడదూ? కాస్త తెల్లబడతావేమో!''

...

''ఓహ్! సృజనా! టైపులో మీ స్పీడెంత? నిముషానికి వందా? రెండు వందలా? స్ప్రింగ్ యాక్షనుందా మీ ఫింగర్స్‌లో? జీయంగారు మీ గురించీ చెప్పినట్నుంచీ చంపేస్తున్నారు. తన బ్రాంచికి ట్రాన్స్‌ఫర్ చెయ్యమని''

...

''బ్యూటీ పార్లర్‌కి వెళ్ళి బ్లీచింగ్ చేయించుకోవచ్చు కదా, వదినా నువ్వు?''

...
కాంట్రాస్ట్. ఇంట్లోకీ ఆఫీసుకీ కాంట్రాస్ట్. అక్కడ తనంటే అందరికీ యిష్టం. నువ్వందంగా వుండవనరు. కొలీగ్స్‌కి తన హెల్పింగ్ నేచర్ నచ్చుతుంది. ఆఫీసర్స్‌కి తన వర్క్ నచ్చుతుంది. అందులోని నీట్‌నెస్, స్పీడ్ మరీ నచ్చుతాయి. తనని పియ్యేగా తీసుకోవడం కోసం ఎమ్డీలు పోటీపడతారు. సునీల్‌కి మాత్రం తనలో వున్నవేవీ కనిపించవు. లేని ఆ ఒక్కటీ కనిపిస్తుంది.

నువ్వు అందంగా వుండవు. నల్లగా వుంటావు.

అసలేమిటి, అందమంటే? దానికి నిర్వచనం ఎవరు చెప్తారు? తెల్లటి రంగొకటేనా, అందానికి నిర్వచనం? అందం ఒకటేనా, మనిషికి క్వాలిఫికేషన్?

సృజన కళ్ళలో నీళ్ళు.

ఆనందం నుంచీ నిర్లిప్తతకీ, నిర్లిప్తత నుంచీ దుఃఖానికీ, అక్కడి నుంచీ యింకెక్కడికి ప్రయాణం?

★ ★ ★

''నీతో కలిసి ఎక్కడికేనా వెళ్ళాలంటే సిగ్గనిపిస్తోంది. అంతా మన్నే చూసి నవ్వుకుంటున్నారు''

'మనని చూసి నువ్వుకునేంత తీరిక ఎవరికీ లేదు. అది నీలోని కాంప్లెక్స్'

''డబ్బు చూసి ఏ పనీ చెయ్యకూడదు. ఛ..ఛ.. పెళ్ళి విషయంలో తొందరపడ్డాను''

'పోనీ, యిప్పుడు సరిదిద్దుకుందామా, యిద్దరం హాయిగా బతకచ్చు'

''డబ్బుతో సాధించలేనిది ఏదీ వుండదనుకుంటాం. కానీ ఎలకతోలు..''

'...నీ వంకరబుద్ధి?'

సృజనకి ఏడుపొస్తోంది. అతను అనే మాటలకి తిరగబడి ఎన్నో అనాలనుకుంటుంది. కానీ వుక్రోషం తప్ప ఒక్క మాట కూడా పెదవిదాటి రాదు. ఆలోచనల్లో డీసెన్సీ తొలగిపోయింది. మాటల్లోంచీ కూడా అది తప్పుకుని అతన్నించీ రక్షణ ఇవ్వటానికింకా ఎంతకాలం పడుతుంది?



అతన్ని అసంతృప్తికీ తననింత క్షోభకీ గురిచేస్తున్న అందం... ఏమిటీ అందం? మిస్ యూనివర్స్‌లూ, మిస్ వరల్డ్‌లూ అందంగా వున్నారని ఎంతమంది ఒప్పుకుంటారు?

ఆడతనమే స్త్రీకి అందమనేది తన బామ్మ. ఆవిడ ప్రభావం తనమీద బాగానే వుంది.

డిగ్నిటీ, కేరక్టర్- ఈ రెండే స్త్రీకైనా పురుషుడికైనా అందాన్నిచ్చేది అంటుంది తన తల్లి. అలాగే తనని మలచింది.

దేవుడిచ్చని శారీరక సౌందర్యంకన్నా, తనకి తాను సంపాదించుకున్న క్వాలిఫికేషన్సే అందమని తననుకుంటుంది.

ఇన్ని రకాల అందాలు వున్నా తనతనికి అందంగా కనిపించకపోవటమేమిటి? పెళ్ళప్పుడు దానికి లేని ప్రాధాన్యత యిప్పుడెందుకు?

★ ★ ★

''కంగ్రాట్స్..షి ఈజ్ యిన్ ద ఫేమిలీ వే'' ప్రెగ్నెన్సీ కన్ఫామ్ చేస్తూ అంది డాక్టరు.

**యస్.శ్రీదేవి**

సునీల్ ముఖంలో విభ్రాంతి..సంతోషం. అక్కడికక్కడే సృజనని రెండు చేతుల్తోటీ ఎత్తి గిర్రుమని తిప్పెయ్యాలన్న కోరికని బలవంతంగా దాచుకున్నాడు. ఎంత ఎదురుచూపు, ఈ క్షణం కోసం?

ఇంటికొచ్చాక చూస్తే సృజనలో అలాంటి సంతోషం కనిపించలేదు.

''అమ్మా! నువ్వు చెప్పు. నీకు మనవడు కావాలా? మనవరాలా?'' తల్లిని అడిగాడు.

''ఎవ్వరైతేనేం? నీ పోలికొస్తే చాలు'' అనేసిందావిడ చాలా మామూలుగా. సృజన దిగ్గున కళ్ళెత్తి చూసింది. ఆమెలో ఆలోచన.

''ఏమిటంత ఆలోచన?'' బెడ్రూమ్‌లోకి

వచ్చాక అడిగాడు.

అప్పటికీ ఆమెలో ఆలోచనే. అడగడానికి సంది గ్ధతే.

''ఏయ్! ఏమైంది?'' అతన్లో ఎప్పుడూ లేనంత ఆర్ద్రత. అతన్లో మార్పొచ్చిందా? ఇంత సడెన్‌గా? ఊ..హు..అలా అనిపించలేదు ఆమెకి.

''పిల్లలెందుకు మనకి? బాబో..పాపో..మీలా కాకుండా నా పోలికల్తో పుడితే? మీరు సరిగ్గా చూస్తారా? అంతేకాదు, యిద్దరు పిల్లల్ని మనం కనబోయేటప్పుడు ఒకరికి మీ పోలికలూ మరొకరికి నా పోలికలూ వస్తే? నాలాగా మరో ప్రాణి యింట్లో క్షోభప డటం దేనికి?'' మాటలు పేర్చు కుంటూ అడిగింది.

''సృజనా'' తెల్లబోయాడు.

''నువ్వు బావుండవు. నీ జీతం, కట్నం-వీటి కోసమే చేసుకున్నాం. ఇలాంటి మాటలు నన్నెంతో బాధపె డ్తాయని మీరెప్పుడేనా ఆలో చించారా? నన్నే చేసుకొమ్మని మిమ్మల్ని బలవంతపెట్ట లేదు. ప్రేమించుకునీ తొందర పడీ చేసుకోలేదు. ఒకరినొకరు చూసుకుని, ఆలోచించుకుని, యిష్టపడి చేసుకున్నాం. నన్ను చేసుకోవటం చేసుకోకపోవటం రెండూ మీ చేతు ల్లోనే వున్నా, నన్ను కోరుకుని చేసుకున్నాక మీలో అసంతృప్తి. ఎలాంటి పిల్లలు కావాలో కోరుకోగ లిగే టెక్నాలజీ మనకింకా రాలేదు. నల్లటి బాబో పాపో పుడ్తే? పాపే పుడ్తే? అందుకే నేను ఎబార్షన్ చేయించుకుంటాను. సైన్సు, టెక్నాలజీ వేగంగా డెవలపౌతున్న ఈ రోజుల్లో మనకి కావాల్సినట్టు పిల్లల్ని కనే రోజు త్వరలోనే వస్తుందనుకుం టాను. అప్పటిదాకా ఆగుదాం. అలా కాకపోతే మనం విడిపోదాం. పుట్టేపాప ఎలాంటిదైనా నాకే ఆక్షేపణా లేదు. నాకు జీవితమంటే అందం ఒక్కటే కాదు, ఫేస్‌క్రీమ్‌లు రాసుకుంటూ పార్లర్ల చుట్టూ తిరగడం కాదు. నేను నా పాప యిని గ్లామర్ డాల్‌లా కాకుండా వ్యక్తిత్వంగలదా నిగా తీర్చిదిద్దుకోగలను. మీరు యిన్ఫీరియా రిటీ కాంప్లెక్స్ యింజెక్షన్



యివ్వకుండా వుంటే, ఆలోచించుకోండి. మీ యిష్టం'' అంది. అలా అడగటంలో ఆమెకి గుండెల్ని మెలిపెట్టేసేంత బాధ కలిగినా అతని నిర్ణయం ముఖ్యం. అతని ఆంతర్యం తెలుసుకో వటం ముఖ్యం.

అతనికీ అర్థమైంది, తను కేవలం డబ్బు మనిషి మాత్రమే కాడనీ, పిల్లలకోసం

ఆమెనో, ఆమె చెప్పిన కారణాలకోసం పిల్లల్ని వద్దనుకునేంత మూర్ఖుడు కాదనీ తెలియజెప్పా ల్సిన అవసరం వుందని. కానీ నిర్మొహమాటమ నేది ఒకటి అతని భావాల చుట్టూ కంచుకోట కట్టేసింది.

''చూడు, అందం దేవుడిచ్చేది, మన చేతుల్లో లేనిదని అంటూనే లేనిదానికోసం ఎందుకింత బాధపడ్తున్నావు? నువ్వు నాకు నచ్చలేదని కాదు, ఆ కొద్దిపాటి లోపం కూడా లేకుండా వుంటే యింకా బాగుండేదని..నాకన్నీ ఫ్రాంక్‌గా చెప్పడం అలవాటు. అంతమాత్రం చేత యిలా ఎలా అను కోగలిగావు? ..ఐనా కుంకుమపువ్వూ అవీ తింటే పిల్లలు రంగుగానే పుడతారట.'' అన్నాడు.

ఆమె సుదీర్ఘంగా నిశ్వసించింది. అతని ఆంతర్యం తెలిసినందుకు సంతోషమూ కలగ లేదు, బాధా కలగలేదు. అతనికి తనూ కావాలి, తన ద్వారా పుట్టే పిల్లలూ కావాలి. కానీ ఈ అసం తృప్తి మాత్రం వదలదు. అదొక ముల్లు. దాన్ని తను విరచలేదు. దాన్నుంచీ రక్షణ కావాలంటే తనే ఒక ముళ్ళకవచాన్ని రక్షణగా ధరించాలనేది అర్థమైంది. ఆమెలో ఒక నిర్దుష్టమైన మార్పు. ఇంకా ఏ మూలో కొసప్రాణంతో కొట్టుకుం టున్న డీసెన్సీ అనేది పూర్తిగా చచ్చిపోయింది.

''ఔనూ, మీరు డబ్బుకోసమే నన్ను చేసుకు న్నానని అంటుంటారు కదా, ఇంకా డబ్బున్న కురూపి నాకన్నా ముందే తటస్థించి వుంటే ఆమెనే చేసుకుని వుండేవారా? అంతేలెండి డబ్బు మనుషు లకి అంతకంటే ఆలోచనేం వుంటుంది?''

చాలాసేపటి తర్వాత ఆమె గొంతు వినిపించింది. అతనికి కమ్చీదెబ్బ తగిలిన ట్లైంది. ఆమె గొంతు వికృతంగా వినిపించింది. అచ్చం ఆమెకి అతని గొంతు విని పించినట్టే. అతని మీద తిరుగుదాడి చెయ్యటానికి ఆమె దగ్గర ఇప్పుడు అనేక అస్త్రాలున్నాయి. ఇంకా కూడా తను నిర్మొహమాటంగా వుండాలా వద్దా అనేది పూర్తిగా అతనిష్టం.

✪

## నేనేం పట్టించుకోను

'ఈమధ్య బాలీవుడ్ సినిమాల్లో అశ్లీలం ఎక్కువైపోతోందంటూ కొంతమంది నన్ను పనిగట్టుకుని విమర్శిస్తున్నారు. కొన్ని సన్నివే శాలకు తగ్గట్టుగా ముద్దు సీన్లు వగైరా ఉండొచ్చు. అయితే నేను మాత్రం భారీ ఎక్స్ పోజింగ్‌లకి ఛాన్స్ ఇవ్వడంలేదు' అంటోంది బెంగాలీ రసగుల్లా బిపాసాబసు. బాలీవుడ్‌లో ఇప్పుడు ఎవ్వరినోట విన్నా బిపాసా మాటే. 'ఎంతో ఖర్చుపెట్టుకుని సినిమాలకి వచ్చే జనం ఏదో ఆశిస్తారు. వారిని సంతృప్తి పరచలే కపోతే సినిమా పరిశ్రమ మనుగడ కష్టమే' అంటూ వ్యాపారసూత్రాల్ని వల్లె వేస్తోంది. నేను చెప్పే మాటల్ని విన్నా, వినకున్నా నా పద్ధతి నాదే అంటోంది బిపాసా. ఈ డేర్ అండ్ డేషింగ్ లేడీని కదిపితే ఇలాగే ఉంటుంది.